


# ఏమైంది కదా!....

**పాపికొండలు వేపెళ్ళే గోదావరి రూట్లో దేవీపట్నం దాటాక వచ్చే అగ్రహారంలోనూ ఆ పక్కనే ఉన్న పెంకులపాడు, మడిపల్లి లాంటి ఊళ్ళలోనూ ఒంటికాలూ, ఒంటిచెయ్యి, ఒంటికన్ను ఉన్నవాళ్ళు అక్కడక్కడా కనిపిస్తుంటారు. ఏంటని ఎవరన్నా అడిగితే లబోదిబోమని ఏడుస్తా రౌడీ అయిన చాకలి గోవిందు గురించి చెపుతారు.**

రౌడీ గోవిందు పొట్టిగా లావుగా పెద్ద పొట్టేసుకుని పెద్ద మీసాలు బండపెదాల్తో చూడ్డానికి ఛెండాలంగా ఉండే వాడికి మేనకోడలుంది పేరు పుష్ప. ఆప్రాంతంలో అంత అందగత్తెని ఎక్కడా చూడం మనం.

అయితే, గోవిందుకో కోరికుంది. అదేంటంటే... పుష్పని పెళ్ళిచేసుకోవాలి. అదీ పుష్ప ఊ అంటేనే. ఆ పిల్ల ఊ అనే రోజుకోసం ఎదురుచూస్తా కూర్చున్నాడు. ఈలోగా ఎవడన్నా ఆ పిల్ల మీద కన్నేస్తే కన్ను, చెయ్యేస్తే చెయ్యి తీసేస్తున్నాడు.


అలాగ జనం చేతులూ, కాళ్ళూ తీసేస్తున్న గోవిందు ఏడాదిలో సగం రోజులు పాటు రాజమండ్రి జైల్లోనే ఉండొస్తున్నాడు. ఈ

మధ్య రవణబాబు అనే కుర్రాడు ఆరిన బట్టలు మడత పెడ్తున్న పుష్ప జబ్బమీద చెయ్యేసి ఏదో చెయ్యబోతే వాడి చెయ్యి తీసేసిన గోవిందు ప్రస్తుతం జైల్లో ఉన్నాడు.

* * *

ఎండాకాలం బాగా ముదిరింది. రోహిణీకార్తి మొదలైంది. చల్దిపొద్దువేళకే చిరచిరలాడతూ ఉంది. గాలి ఆడక గోదాట్లో నీళ్ళు ముందుకి కదలడం లేదు. ఎండలకి నీళ్ళు ఎండిపోడంతో తిప్పలు బాగా వేసిసినియ్యి. లోపల చేపలు కదలడంతో నీచు వాసనొస్తున్నాయి నీళ్ళు.

రాజమండ్రి నించి కూనవరం వెళ్తున్న పాదం వెంకటరవణమూర్తిగారి ముద్దుకృష్ణా లాంచీలో



లోడు ఎక్కువ వేసెయ్యడం వల్ల భారంగా కదుల్తా గోదారి మేటలు వెయ్యని చోట్లు చూసుకుంటా వెళ్తుంది ముందుకి.

కొత్తగా గుమస్తా పనిలో చేరిన అన్నారం ఒకో పేసింజరు దగ్గరా కేవులు వసూలు చేస్తుండగా అగ్రహారం రేవులో కొచ్చి ఆగింది లాంచీ. పచ్చని పరికిణీ ఎర్రటి వాయిలు కండువా వేసుకుని చేతిలో తాటాకుబుట్టతో ఎక్కిన పుష్ప ''టికెట్టు కొండమొదలు రేవుకండి'' అని మాసిపోయిన అయిదు కాయితం ఇచ్చింది.

లాంచీలో జనమంతా పుష్పనే చూస్తా ఆ పిల్ల గురించీ ఆళ్ళ మాయ్య గోవిందుగురించీ మాటాడుకుంటున్నారు. కొత్త గుమస్తా అన్నారం అయితే విప్పిన కంటిరెప్పలు ముయ్యకుండా చూస్తున్నాడు పుష్పని. లాంచీ సరంగు కామేశ్వర్రావొచ్చి ''టాపు మీద ఖాళీగా ఉంది బుల్లీ! ..ఎళ్ళి అక్కడ కూకోమ్మా'' అన్నాడు.

ఈ లాంచీలో చాలా తక్కువ జీతానికి చేరిన అన్నవరం ఇవేళో రేపో మానేద్దారి అనుకుంటున్న మనిషల్లా ''ఆ ఓనరుగారు పావలా ఇచ్చినా సరే అర్ధణా ఇచ్చినా సరే పని మానను'' అని గండిపోచమ్మ తల్లి మీద ఒట్టేసుకున్నాడు.

* * *

కోండ్రుకోట, వాడపల్లి, ఈరారం, ఒక్కోరేవులో ఆగుతా ఎక్కే జనాన్ని ఎక్కించుకుని దిగే జనాన్ని దింపుకుంటూ వెళ్తుంది ముద్దుకృష్ణా లాంచీ.

ఆ లాంచీ లోపలి ఇంజను లాగ పని చేసుకుంటూ పోతున్న అన్నవరం మనసు మట్టుకి ఆ పుష్ప దగ్గర ఆగిపోయింది.

లాంచీలో వంటలు చేసే రాంబాబుగాడు గేలమేస్తే దొరికిన బొచ్చు చేపని కదుల్తుండగానే కోసి పాత చింతపండుతో చిక్కని పులుసెట్టి సవ్వాదిగా కాస్తున్నాడు.

అన్నంలో ఆ పులుసు కలుపుకుంటున్న అన్నవరం మనసు ఆ పుష్పమీదే ఉంది. లేత తాటిముంజి నములుతున్నట్టు ముకం పెట్టి ''టికెట్టు కొండమొదలు రేవుకండి'' అని ఎంత సుతిమెత్తగా అడిగిందా మనిషి! అనుకుంటా ముద్దని చేత్తో పట్టుకుని అలాగుండిపోయేడు.

పాపికొండలు వేపెళ్తంది లాంచీ. గాలి పెరగడంతో లాంచీలో జనం జుట్లు ఎగురుతున్నాయి. టేకూరు రేవులో పాటలు పాడే సాధువుగారూ, మషాళా బొటానీలు అమ్మే కుర్రోడు ఎక్కేరు. వంటోడు రాంబాబు టీ కాచి పేసింజర్లకి అమ్ముతున్నాడు.

చీడూరు దాటి శివగిరి వేపెళ్తుంది లాంచీ. సీవండి గ్లాసులో టీ పోసిచ్చేడు రాంబాబు. తాగుతున్నాడుగానీ మనసు ఆ పుష్పమీదే ఉంది. చేతిలో తాటాకు బుట్ట పట్టుకుని బల్లదిగి ఒడ్డు కెళ్తున్నప్పుడు ఎంత అందంగా నడిచింది ఆ మనిషి అనుకుంటా లాంచీ సరంగు కామేశ్వర్రావునీ, గెడేసే సత్తిబాబునీ అడిగి ఆ పుష్ప బోగట్టా కనుక్కున్నాడు.

రెండోరోజు లాంచీ అగ్రహారం రేవులో ఆగినప్పుడు కాస్త ఎడంగా తక్కినవాళ్ళతో పాటు బట్టలుతుకుతా కనిపించిన పుష్ప పొద్దుటే పూచిన పొద్దు తిరుగుడు పువ్వు లాగుంది. గోదావరి గాలికి ఊగుతున్న అరిటిచెట్టు ఆకులెనకాల చందమామ లాగుంది.

తన బట్టలమూట పట్టుకెళ్ళి పుష్పకిచ్చి ''రేపొచ్చేపాలికి బాగా ఉతికి గంజెట్టి ఇస్త్రీ చెయ్యకూడదు మరి'' అన్నాడు.

నవ్వుతా మూటందుకుంది పుష్ప.

* * *

పోను పోను అన్నవరం మతి మందగిస్తుంది. ఒక్కరోజు అగ్రహారం రేవులో ఆ పుష్పని చూడకపోతే అదోరకమైన మనియాదతో

గింజుకుపోతున్నాడు. అన్నారం వాలకం చూస్తున్న లాంచీలో పనోళ్ళంతా ఆ పిల్ల మేనమావ కథలు కళ్ళకి కట్టినట్టు చెప్పారు.

ఏమాత్రం వినడం లేదు అన్నవరం. అంతకు ముందెప్పుడూ ఏ మగాణ్ని చూసినా పలకని పుష్ప అన్నవరాన్ని చూసి నవ్వడం పలకరించడం లాంటి పన్లు చేస్తంది. ఓ రోజు ఆ పిల్ల కావాలంటే లాంచీని ఆపేసి ఈదుకుంటా లంకలోకెళ్ళి దోసకాయలు కోసుకొచ్చేడు. ఇంకోరోజు పుచ్చకాయలు కోసుకొచ్చేడు.

అది చూసిన సరంగుకృష్ణ "ఇదేదో ముంచుకొచ్చే యవ్వారం లాగుంది" అన్నాడు తోగుమ్మి బాలయ్యతో. గోవిందుగాడొస్తే ఏం జరుగుద్దో అనుకుంటా తెగ భయపడిపోతున్నారంతా.

వంటోడు రాంబాబు వండిన పేటపలావు పొట్లం పుష్పకోసం పట్టుకెళ్తే బెండకాయ పచ్చిరెయ్యల పులుసు కేరేజీ పట్టుకుని అన్నవరం కోసం ఎదురొచ్చింది పుష్ప.

* * *

రోజులు గడుస్తున్నాయి. ఎండాకాలం పెళ్ళిపోయి వర్షాలు మొదలయ్యినియ్యి. గోదావర్లో వరదనీరు రావడం మొదలెట్టింది.

అన్నవరం పుష్పగురించి అగ్రహారంలోనే గాకుండా ఆ చుట్టుపక్కలున్న మావిడిగొందు, తూటిగుంట, టేకూరు దాకా పాకిపోయింది.

గోవిందు దిగేకా జరిగే ఘాతుకాలగురించి ముందే వూహించేసుకుంటున్నారంతా. గోవిందు జైల్లోంచొచ్చే రోజులు దగ్గర పడిపోతున్నాయి.

ఓ రోజున లాంచీ ఓనరు మూర్తిగారు పిల్చి "ఆనాకోరేపో ఆ గోవిందుగాడు దిగి పోతున్నాడు. నీ స్టోరీ విన్నాకా మాలాంచీ తగలెట్టేస్తాడేమో అని భయంగా ఉంది. కాబట్టోరే నీకు రావాల్సింది సెటిల్ జేసేస్తున్నాను వెళ్ళిపో నాయనా" అని తోసేసేడు అన్నవరాన్ని.

పుష్పతో పాటు రాజమండ్రీ వచ్చేసి అక్కడ్నించి రామచంద్రపురంలో తేలాడు.

ద్రాక్షారామం భీమేశ్వరుడి గుళ్ళో పుష్పని పెళ్ళి చేసుకుని ఆ పనీ ఈ పనీ చేసి చివరికి బలుసు సుబ్బారావుగార్ని పట్టుకుని చెల్లూరు షుగరు ఫేక్టరీలో పని సంపాయించి దగ్గరగా ఉంటదని మకాం పసలపూడిలో పెట్టాడు.

* * *

ఇలా ఫేక్టరీలో డ్యూటీ అయిపోయిన వెంటనే అలాగొచ్చేసి ఇంట్లో వాలిపోతాడు అన్నవరం. అప్పుడా మనిషికేసి చూసిన పుష్ప "రోజంతా ఇంట్లో ఒంటరిగా ఉండే నేను ఎక్కడ బెంగెట్టుకుంటానో అని వచ్చేస్తుంటాడీ మనిషి. నేనంటే ఎంత ప్రేమ ఎంత ఇష్టం" అనుకుంటా పొయ్యెలిగించి టీ కాచే పనిలో పడే పుష్పకి గోవిందుగానీ గుర్తొస్తే వళ్ళంతా గగుర్పొడుస్తుంది. తల్లోంచి పుట్టిన చెమట్లు చెంపలమీంచి కారుతున్నాయి. తనిక్కడుందని తెలిస్తే కత్తట్టుకుని వచ్చెయ్యడానికి ఏమాత్రం వెనకాడ్డా మనిషి.

శలవు రోజున అసలు తనని ఇంట్లోంచి బయటికి రానియ్యకపోవడం జూసి "మాకు జరగాలేగానీ అసలు ఎండపొడే నాకు తగలియ్యడీమనిషి" అనేసి నవ్వేసుకుంటది. అసలు పుష్పని ఒంటరిగా ఎక్కడికీ వెళ్ళనివ్వడు. మనిషి ఇంట్లోంచి కదిల్తే కూడా తను ఉండాల్సిందే. నడుస్తున్నప్పుడు తన నీడలో అతని నీడ కలిపి అలాగ నడుస్తుంటే అతన్నే చూస్తా "ఇంత గొప్పోడు నా పెనిమిటిగా దొరకడం ఎంత అదృష్టం...బగమంతుడా నన్ను నా భర్తనీ చల్లగా చూడు సామీ. ఎప్పుడన్నా మా మాయ్య గోవిందుగానీ కత్తితో దిగిపోతే కాపాడే భారం నీదే తండ్రీ...నువ్వే అడ్డుకోవాలి ప్రెభువా. గోదారి మధ్యలో ఉండే ఎందర్నో నీ గండి దాటించి పంపించే గండి పోశమ్మ తల్లీ! మా మాయ్యని మట్టుకి నీ గండి దాటి మా పక్కకి రానియ్యకండా కాపాడు తల్లీ!" అనేసి దణ్ణమెట్టుకుని తన శతమానాన్ని కళ్ళకద్దుకుంటది



వంశీ పసలపూడి కథలు-72

తప్ప తన భర్త ఇలా ప్రవర్తించడానికి వెనకకారణం తన్నే కన్నేసి ఉంచుతున్నాడని అనుకోదు. భర్తనలా అర్థం చేసుకోదు ఆ పుష్ప.

* * *

నిన్నటిదాకా పెళపెళమంటా కాసిన ఎండ ఆవేళ లేదు. ఆకాశం నిండా మబ్బులు పట్టేసుంది. చిక్కగా గెచ్చకాయ రంగు మబ్బులు. వీధుల్లో ఎర్రకంకరదుమ్మంతా ఎగరగొడుతూ గాలీ చలిగాలి తిరిగింది.

మధ్యాన్నం దాకా అలాగే భయపెట్టి ఆ తర్వాత మొదలైంది వర్షం. ఒకటే హోరు ఒకటే గాలి.

రత్తమ్మగారి కిరాణాకొట్లో శనగపిండి పదలం నూనీ పట్టుకొచ్చి పకోడీ లెయ్యడం మొదలెట్టిన పుష్ప వాయ అవ్వగానే సీవండి కంచంలో వేసి రగ్గు కప్పుకు పడుకున్న అన్నవరాని కందిస్తుంటే హాయి హాయిగా తింటున్నాడు. రాత్రికి మధ్యాన్నం పప్పుచారు వేడిచేసి వేటమాంసం వేపుడేసింది.

ముసురు తగ్గలేదు. మర్నాడూ అలాగే ఉంది. తుఫానట. వర్షానికి చలిగాలికీ ఇంట్లోంచెవళ్ళు అడుగు బయట పెట్టడం లేదు.

సైకిలు బయటికి తీసిన అన్నవరం "సూర్రావుపేటలో కాపురముండే ఆ నందికోళ్ళ భైరవస్వామిగాడూ ఇవ్వేళ డ్యూటీకి రావడం లేదట. రెండు షిప్పులూ నేనే చెయ్యాలి. తెల్లారిపోద్ది మరి..." అని విసుక్కుంటా "నువ్వసలు బయటికి రావొద్దు. అసలు ఏసుకున్న తలుపు తెరవొద్దు... వినబడతంతా తెరవొద్దంటే తెరవొద్దంతే...ఒకవేళ తెరిచినా పక్కింట్లో ఎవడో బ్రహ్మచారిగాడు దిగేడు ఆడికేసి కన్నెత్తి చూడొద్దు అర్థమవుతుందా?" అని చెప్పిందే పదిసార్లు చెప్పి సైకిలెక్కి అ యిష్టంగా బయల్దేరేడు.

అన్నవరం డ్యూటీకి బయల్దేరిన నాలుగ్గంటలకి బాగా పెరిగిపోయింది వర్షం. ఎక్కడా తెరిపివ్వకండా అలా కురుస్తానే ఉంది. దానికి తోడు గాలొకటి. అది మామూలుగా లేదు అంతకు ముందెప్పుడూ ఎరగనంతగా వీస్తుంది. బక్క పల్చగా ఉండే మనుషుల్ని ఎగరగొట్టేస్తుంది. ఇళ్ళ మీద బంగాళాపెంకులు పేకదారం తెగిన గాలి పటాల్లాగా ఎగిరి పోతున్నాయి. తూరుప్పేటలో రాములోరి గుడి ముందు రావిచెట్టుకొమ్మలన్నీ విరిగిపోయినియ్యి. బంద్రేవుగట్టు మీద బాబూరావు మేష్టారి ఇంటవతల నిద్రగన్నేరు చెట్టు అమాంతంగా పడిపోయింది. రాయలరెడ్డిగారింటవతల మిషనుకుట్టే ఖాదర్ పాటిమట్టిఇల్లు కూలిపోయింది. కాలవ దగ్గర పట్టాభిరామయ్యగారి కిళ్ళీకొట్టు అవతలున్న గానుగచెట్టు వేళ్ళతో సహా కూలి రోడ్డు కడ్డంగా పడిపోయుంది.

దీపాలవేళ అవ్వకముందే చిక్కగా చీకటిపడిపోయింది. తుఫాను మరీ పెరిగిపోయింది.

వెలిబూడిదతో చిమ్నీ తోమిపెట్టి వెలిగించిన హరికెన్‌లాంతరు ద్వారబంధం మధ్య వాసం మేకుకి తగిలిస్తా "ఇక్కడ తుఫాను చూస్తే ఇలాగుంది. అక్కడా మనిషి ఎలాగున్నారో" అనుకుంటా అరుగుమీద కూర్చున్న పుష్పకి ఉప్పుమందయ్యగారి పాతిల్లు కూలిపోడం తన కళ్ళతోచూడ్డంతో భయం బాగా పెరిగిపోయింది. తనలో తనే ఏదేదో అనేసుకుంటా అన్నారం గురించే ఆలోచిస్తుండగా ఠప్పున ఆరిపోయింది లాంతరు. భయం పెరిగిపోయింది పుష్పలో. తడుచుకుంటా, బురద తొక్కుకుంటా పక్క ఇంట్లో ఉంటున్న శ్రీనివాసు దగ్గరకెళ్ళి "తుఫానుజూస్తే ఇలాగుంది ఆ మనిషేమో చెల్లూరు ఫేక్టరీలో పన్లోకెళ్ళేరు. నాకేదో భయంగా ఉందండి... కొంచెం ఆ ఫేక్టరీ దాకా సాయం వస్తారా?" అంది.

కంగారు పడిపోయిన శ్రీను "ఈ తుఫాన్లోనా?" అన్నాడు.

"ఆయనకేదో అయిపోయిందని నాకు చాలా భయంగా ఉందండి... ఈ ప్రెపంచకంలో ఆ మనిషి తప్ప ఇంకెవ్వళ్ళూ లేరండి నాకు... బాబ్బాబూ" అని ఏడుస్తున్న పుష్పని చూసిన శ్రీను "సరే పద" అన్నాడు.

మున్సబుగారి తూమూ, సుబ్బారాయుడి గుడి. గొల్లలతూమూ దాటుకుంటా కాలవగట్టు ఎక్కి, వంతెన దిగి దిగడం తోటే మొలలోతు

నీటిగుంటలో దిగడిపోయేరిద్దరూ.

నానా అవస్థాపడి పైకిలేచి నడుస్తా దూరంగా కుడిపక్కనున్న క్రిష్ణారైసుమిల్లు దాటి చెల్లూరు కంకర్రోడ్డు మీదెళ్తున్నారు. ఇంతలో రోడ్డుకి ఎడం పక్కనున్న నిద్రగన్నేరు చెట్టు పెళపెళమని చప్పుడు చేస్తా నేలమీద వాలిపోయింది.

నడుస్తున్న ఆ ఇద్దర్నీ ఎదురొచ్చి మరీ తోసేస్తుంది గాలి. దాంతో ముందుకి అడుగెయ్యడమే కనాకష్టంగా ఉంది.

నానాఅవస్థలూ పడతా శీనుతో పాటు తడుస్తా నడుస్తా వెళ్తున్న పుష్ప ఉన్నట్టుండి బోర్లాపడిపోయింది. ఎడం చెంపా మోచెయ్యీ దగ్గర చర్మం కొట్టుకుపోయినియ్యి. కారుతున్న రక్తాన్ని ఆ వర్షంనీళ్ళు కడుగుతున్నాయి.

పుష్పని లేపి ముందుకు నడిపిస్తున్నాడు శ్రీను.

ఆ సన్నటిరోడ్డుకి ఎడం పక్కనే ఉంది పంటకాలవ. రోడ్డు నీళ్ళతో నిండిపోడంతో ఏది కాలవో ఏది రోడ్డో అర్ధంగాకండా ఉంది.

శ్రీనుతో పాటు అవస్థపడతా నడుస్తున్న పుష్ప కాళ్ళు దభీల్మని దిగడిపోయినియ్యి. పాలికేక పెడతా కొట్టుకెళ్ళిపోతుంది. ఆదరాబాదరా వెళ్ళిన శ్రీను నానాకష్టాలూ పడతా ఆ మనిషిని కాలవలోంచి లాగుతున్నాడో లేదో పక్కనే ఉన్న తాడిచెట్టు ధనాల్మని పడింది.

ఒగురుస్తా పుష్పని చూసిన ఆకుర్రాడు "కొంచెం ఉంటే మనిద్దరం ఆయిపోయేవాళ్ళవే..ఈ తుఫాన్లోనా అంటే విన్లేదు" అన్నాడు.

"అక్కడ నా దేవుడు... నా పెనిమిటి..నా ప్రేణంలో ప్రేణం... ఎలాగున్నాడో ఏంటో... ఆ మనిషికోసమే నా పూజలు... నా ప్రార్ధనలు బాబ్బాబూ..పసలపూడి రాజేశ్వరస్వామే పంపేడు మిమ్మల్ని అనుకుంటున్నాను... బాబ్బాబూ నాయనా" అంది.

ఆమెని అర్ధం చేసుకున్న అతను మారుమాట మాటాడకండా రెక్క పట్టుకు నడిపించడం మొదలెట్టేడు.

ముంచుకొస్తున్న ఆ తుఫాను ఎదురీదతా, నానా అవస్థా పడతా చింతావారి చావిడీ, ముత్యాల రామన్నచౌదరిగారి చావిడీ దాటుకుంటా మొత్తానికి చెల్లూరు సుగరుఫేక్టరీ లోపలికొచ్చేరు.

బయట తుఫాను హోరుతో గందరగోళంగా ఉన్నా అక్కడక్కడా పెడ్లమీద డోరియా రేకులు ఎగిరిపోతున్నా ఫేక్టరీ లోపల వెచ్చగా ఉంది. బయటి గడగడా చప్పుళ్ళు చేస్తా హాయిగా పని చేస్తున్నాయి మిషన్లు. వాటిచుట్టూ బోల్డు మంది పనివాళ్ళు.

బాయిలర్ దగ్గర చలికాచుకుంటా కూర్చున్నాడు అన్నవరం. అంతట్లో ప్రాణంపోయే దశలో పడతాలేస్తా లోపలికొచ్చిన పుష్ప భర్త అన్నవరం హాయిగా క్షేమంగా ఉండటం జూసి మంగళసూత్రాల్ని కళ్ళ కద్దుకుంది.

తల తిప్పి భార్యని చూసిన అన్నవరం పరుగు పరుగున దగ్గరకొచ్చి ముద్దయిపోయిన ఆ మనిషిని దగ్గరకి తీసుకుని లబోదిబోమని ఏడుస్తా ఆమెని తన గుండెలకి అద్దుకుని తన గుండెకాయ పగిలేలాగ ఏడుస్తా "ఈ తుఫాన్లో ఎలాగొచ్చేవు పుష్పా నేనిక్కడ బానే ఉన్నానుగదా... కుక్కచావు చస్తా అసలెందుకొచ్చేవు...అయ్యయ్యో ఈ చేతులూ, చెంపా ఏంటిలా కొట్టుకుపోయినియ్యి... ఈ చీరేంటిలా పీలికలయిపోయింది... అరె ఎడం జబ్బ మీదేంటి రక్తం? పుష్పా ఏంటిదీ" అనేసి గొల్లుగొల్లున ఏడ్వాల్సిన మనిషి, దూరంగా నిలబడి పుష్ప పక్కనే తడిసి ముద్దయిపోయున్న శ్రీనుని చూస్తా "ఈడు మా పక్కింటి బ్రహ్మచారి గదా? ... ఈడితో కలిసొచ్చిందేంటి పుష్ప? ... ఈడితో ఎన్నాళ్ళనించి పరిచయం.." అనుకుంటా చూస్తున్నాడు అన్నవరం.

* * *